




ఈద్గా మైదానంలో ముస్లింల ప్రత్యేక నమాజు

సద్గుణ మార్గమే రంజాన్

- సేవాగుణం, శాంతియుత జీవనం అలవరచుకోవాలి..
- ఈద్గాలలో మత పెద్దల పిలుపు
- ఉమ్మడి జిల్లాలో ఘనంగా 'ఈద్-ఉల్-ఫితర్'





కొత్త బస్టాండ్ ఎదురుగా ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు

కర్నూలు కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ఆచరించిన ఉపవాస దీక్షల సారం సద్గుణమార్గంలో జీవించడమే అని మత పెద్దలు ఉద్బోధించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సోమవారం 'ఈద్-ఉల్-ఫితర్' (రంజాన్) వేడుకను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక ఈద్ నమాజులు నిర్వహించారు. మతపెద్దలు ప్రార్థనలు చేయించి, దైవ సందేశం అందించారు. రంజాన్ మాసం ముప్పయ్ రోజుల్లో ఉపవాసం దీక్షల ద్వారా పొందిన పరివర్తన ఏడాది పొడవునా కొనసాగించాలని, జీవన మార్గంగా స్వీకరించాలని ఉద్బోధించారు. ఈ ప్రార్థనల్లో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్టాల సవరణకు నిరసనగా, నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

రంజాన్ వేడుకల్లో ప్రముఖులు

ఉమ్మడి జిల్లాలో సోమవారం రంజాన్ వేడుకల సందడి కొట్టొచ్చినట్లు కనిపించింది. పేద, ధనిక వర్గ భేదాలు లేకుండా అందరూ పండుగను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. కర్నూలు జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, నంద్యాల జిల్లాలోని నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఆత్మకూరు, డోన్ తదితర ప్రాంతాల్లో ఈద్ నమాజులకు వేలాదిగా హాజరయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ పి. రంజిత్ బాషా, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ హాజరై శుభాకాంక్షలు తెలిపారు.



రంజాన్ ప్రార్థనలో మంత్రి టీజీ భరత్



రంజాన్ వేడుకల్లో కలెక్టర్ రంజిత్ బాషా

కరువు కాలంలో ఉపశమనం..!



ఖరీఫ్ కాస్త కరుణించినా, రబీ సీజన్ కన్నీరే నింపింది. ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో వానలు సరిగా కురవలేదు. నానా కష్టాలుపడి పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం రబీ రైతులకు ఉపశమనం కల్పిస్తూ ఉమ్మడి జిల్లాలో 15 కరువు మండలాలను ఎంపిక చేసింది. అందులో పది మండలాలు తీవ్రంగా కరువువాత పడ్డాయని గుర్తించింది. ఇందులో కర్నూలు జిల్లాలో తొమ్మిది, నంద్యాల జిల్లాలో ఒక మండలం ఉన్నాయి.

- ఉమ్మడి జిల్లాలో 15 కరువు మండలాల ఎంపిక
- తీవ్ర కరువు ప్రభావిత మండలాలు 10
- కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో ఒకటి
- రబీ సీజన్ కోసం ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



కర్నూలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కరువు పీడిత మండలాల రైతులకు కొంతలో కొంత ఉపశమనం కలిగించే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. కరువు మండలాలను ప్రకటించింది. వర్షపాతం, పొడి వాతావరణంతో పాటు సాగు విస్తీర్ణం, పంట నష్టం, భూగర్భ జలాల స్థాయి, వ్యవసాయ స్థితిగతులు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని 2024-25 రబీ సీజన్‌లో కరువు మండలాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. జిల్లా కలెక్టర్లు పంపిన ప్రతిపాదన మేరకు ఈ నెల 28న వర్చువల్ ద్వారా సమావేశమైన కరువు ప్రభావ కమిటీ ఆరు జిల్లాల్లో 37 మండలాలను కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో 5 మండలాలు ఎంపిక చేస్తూ రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. జిల్లా పశ్చిమ మండలాల్లో తీవ్ర కరువుతో తల్లడిల్లుతున్న పలు మండలాలకు ఈ జాబితాలో చోటు దక్కలేదు. రెండో విడతలోనైనా ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు.

కర్నూలు జిల్లాలో రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1,17,288 హెక్టార్లు. గత ఏడాది 2023-24 రబీలో 94,391 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేస్తే.. ఈ ఏడాది 2024-25 రబీ సీజన్‌లో 87,320 హెక్టార్లలో సాగు చేశారు. అంటే.. సాధారణం కంటే 29,968 హెక్టార్లు సాగు తగ్గింది. ఆహార ధాన్యాల (ఫుడ్ గ్రైన్స్) పంటలు 18,176 హెక్టార్లకు గానూ 19,548 హెక్టార్లలో సాగు చేశారు. పప్పు దినుసుల పంటలు 69,958 హెక్టార్లకు గానూ 43,345 హెక్టార్లలో సాగు చేశారు. సాధారణం కంటే 38 శాతం తక్కువ సాగు అయ్యింది. నూనె గింజల (ఆయిల్ సీడ్స్) పంటలు 16,081 హెక్టార్లకు గానూ 9,104 హెక్టార్లలో సాగు చేశారు. ఈ పంటలు కూడా సాధారణం కంటే 43 శాతం తక్కువ సాగు చేశారు. ఉద్యాన పంటలు 6,853 హెక్టార్లకు గాను 5,681 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. సాధారణం కంటే 17 శాతం తక్కువ సాగు చేశారు. అన్ని రకాల పంటలు పరిశీలిస్తే సాధారణం కంటే 26 శాతం తక్కువ సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. అదే క్రమంలో వర్షపాతం కూడా రబీలో సాధారణం కంటే తక్కువే నమోదు అయ్యింది. పలు మండలాల్లో కనీస వర్షపాతం కూడా నమోదు కాలేదని అధికారులు అంటున్నారు. కరువు మండలాల ఎంపిక కోసం భారత ప్రభుత్వ మాన్యువల్-2016



మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ఇచ్చిన నివేదిక ప్రకారం జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించారు. పరిశీలించిన కరువు కమిటీ సిఫారసు మేరకు అత్యంత తీవ్ర కరువు మండలాలుగా ఆస్పరి, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్, మద్దికెర, ఓర్వకల్లు, గూడూరు, కోడుమూరు, వెల్దుర్తి మండలాలను ఎంపిక చేశారు. పత్తికొండను సాధారణ కరువు మండలాల జాబితాలో చేర్చారు. ఆ మండలాల రైతులకు కరువు సహాయక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉంది.

మిగతా 7వ పేజీలో

సాంకేతికత ఆధారంగా నేరాలపై నిఘా

డ్రోన్ పని తీరును పరిశీలించిన ఎస్పీ

కర్నూలు క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత ఆధారంగా నేరాల కట్టడిపై దృష్టి పెట్టామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి కర్నూలు జిల్లా పోలీసు శాఖకు కేటాయించిన డ్రోన్ కెమెరా పనితీరును ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్‌లో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని స్మార్ట్ పోలిసింగ్‌తో నేరాలను నియంత్రించడానికి డ్రోన్ సాంకేతికతను ఉపయోగించే విదంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్ డీఎస్పీ రమణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజోమూర్తి, కర్నూలు నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడు ఇతర అధికారులు ఉన్నారు.



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

శ్రీగిరిపై ముగిసిన ఉగాది ఉత్సవాలు

- అశ్వ వాహనంపై ఆది దంపతుల విహారం



శ్రీశైలం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం ఉగాది మహోత్సవాలు యాగపూర్ణాహుతితో ముగిశాయి. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపించించారు. అమ్మవారి ఆలయ యాగశాలలో చండీహోమం జరిపారు. తరువాత యాగపూర్ణాహుతి, వసంతోత్సవం, త్రిశూలస్నానం నిర్వహించారు. నారికేళాలు, సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు తదితరాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తిచేశారు. చివరగా పుష్కరిణిలో త్రిశూలస్నానం జరిపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై ఆది దంపతుల విహారం

ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై ఊరేగించారు. అమ్మవారు భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు.



యాగశాలలో పూర్ణాహుతి

ఉపాధి కూలి పెంపు

ఉమ్మడి జిల్లాలో 5 లక్షల మందికి ప్రయోజనం



కర్నూలు అగ్రికల్చర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలి పెంచింది. ప్రస్తుతం రోజువారి కూలి రూ.300 ఇస్తున్నారు. దీనికి అదనంగా రూ.7 పెంచుతూ రెండు రోజుల క్రితం జారీ చేసిన ఉత్తర్వులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయానికి చేరాయి. ఎండలు మండిపోతుండటంతో పాటు పొలం గట్లు గట్టిగా ఉండటంతో వేగంగా పని చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కేంద్రం కూలీలకు అదనంగా వేతనం పెంచింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 5 లక్షల మంది కుటుంబాలకు జాబ్‌కార్డులు ఉన్నాయి. ప్రస్తుత కర్నూలు జిల్లాలో 70వేల మంది, నంద్యాల జిల్లాలో 45 వేల మంది దాకా రైతులు, కూలీలు ఉపాధి పను లు చేస్తున్నట్లు నీటి యాజమాన్య సంస్థ అధికార వర్గాలు తెలిపాయి.

వైభవంగా చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలు

- ఆకట్టుకున్న ఎడ్లబండ్లు, గాడిదల ప్రదక్షిణ
- వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చౌడేశ్వరీ ఆలయం చుట్టూ ఎడ్లబండ్లతో ప్రదక్షిణ చేస్తున్న రైతులు



కల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరులోని చౌడేశ్వరీదేవి జ్యోతి మహోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. సోమవారం తెల్లవారుజామున కల్లూరు ఊరువాకిలి నుంయి నిర్వాహకులు అమ్మవారికి జ్యోతులు ఉత్సవాన్ని ప్రాంభించారు. మంగళ వాయిద్యాలు, తోగటవీర క్షత్రియుల పదఖడ్గాలు, నంది కోల సేవలతో జ్యోతులను ఊరేగింపుగా తీసికెళ్లి చౌడేశ్వరీదేవి ఆలయంలో సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉన్నత చదువులు చదివే అభ్యర్థులు, పెళ్లికాని యువత జ్యోతులను ఎత్తుకుని మొక్కులు తీర్చుకున్నారు.

● **ఆకట్టుకున్న ఎద్దులబండ్లు, గాడిదల ప్రదక్షిణ:** ఉగాది వేడుకల్లో భాగంగా చౌడేశ్వరీదేవి ఆలయం చుట్టూ రైతులు ఎద్దుబండ్లు, రజకులు గాడిదలతో ప్రదక్షిణలు చేశారు. అనాదిగా వస్తున్న ఆచారంలో భాగంగా కల్లూరు ప్రజలు ఆలయం చుట్టూ నారుమడి పద్ధతిలో బురదనీటిలో ఎద్దులబండ్ల ప్రదక్షిణలు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకలకు జిల్లా నలుమూలల నుండి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు.



గాడిదలను అలంకరించి మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధమైన రజకులు

ధాన్యం కొనుగోళ్లతో దళారులకు చెక్



కర్నూలు యార్డులో ధాన్యం కొనుగోళ్లు చేయనున్న ప్రదేశం

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్ యార్డులు ఉన్నా ఇప్పటి దాకా జిల్లాలో ప్రధానంగా సాగయ్యే ధాన్యం పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఏ మార్కెట్ కమిటీ చర్యలు చేపట్టలేదు. దీనివల్ల దళారులు తాము చెప్పిందే ధర అంటూ రైతులను దోచేశారు. ఇటీవల కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులను స్థానిక మంత్రి టీజీ భరత్‌తో పాటు ప్రజాప్రతినిధులను కలిసి కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ధాన్యం కొనుగోల్లు లేకపోవడం వల్ల రైతులు మిల్లర్లను బతిమాలి వారు చెప్పిన చోటుకు ధాన్యాన్ని తీసుకెళ్లి తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూలు మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభం అవుతుండటంతో రైతుల సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రభుత్వం క్వింటం ధాన్యానికి మద్దతు ధరను రూ.2,300 ప్రకటించింది మార్కెట్ కమిటీ అధికారులు నాణ్యత గలిగిన ధాన్యానికి రైతులకు ఈ ధరను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేసీ కెనాల్, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, ఎల్లెల్సీ, గాజులదిన్నె తదితర ప్రధాన రిజర్వాయర్లు, కాలువల ద్వారా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో 2 లక్షల ఎకరాల్లో ధాన్యాన్ని పండిస్తున్నారు. కర్నూలులో ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తే ఈ రైతులందరికీ ప్రయోజనం చేకూరే అవకాశం ఏర్పడింది.

ధాన్యాన్ని కర్నూలు యార్డుకు తీసుకురావాలి



కర్నూలు మార్కెట్ యార్డులో అధికారులు, ప్రజాప్రతినిధులు మంత్రి టీజీ భరత్ సహాయ సహకారాలతో రైతులు పండించిన ధాన్యాన్ని కర్నూలు మార్కెట్ యార్డులో మిల్లర్ల చేత కొనుగోలు చేయించేందుకు నిర్ణయించాం. ఇప్పటికే మార్కెటింగ్ శాఖ రీజనల్ డైరెక్టర్ కమిటీ చైర్‌పర్సన్ రామాంజనేయులు లాంచనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏప్రిల్ 1 నుంచి కర్నూలు మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన ధాన్యాన్ని మిల్లర్లతో కొనుగోలు చేయించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రయోజనం పొందాలి.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, కర్నూలు మార్కెట్ యార్డు

రూ.71.47 కోట్ల పన్నుల వసూళ్లు

- ఈ స్థాయిలో ఇదే తొలిసారి
- నగర ప్రజల సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు
- నగర పాలక మేనేజర్ ఎన్. చిన్నరాముడు

కర్నూలు న్యూసిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి పన్నులు చెల్లించి సహకరించాలనే నగరపాలక సంస్థ పిలుపునకు స్పందించి రూ.71.47 కోట్ల పన్నులు చెల్లించి సహకరించిన నగర ప్రజలకు నగర పాలక మేనేజర్ ఎన్. చిన్నరాముడు, ఆర్వో ఇజ్రాయేలు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం నగర పాలక కార్యాలయంలోని పన్ను వసూలు కేంద్రంతో పాటు సీ. క్యాంపు, బాలాజీనగర్, కల్లూరు వార్డు కార్యాలయాల్లో ఉన్న ప్రత్యేక కౌంటర్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేనంతగా రూ.71.47 కోట్లు సోమవారం సాయంత్రానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు వసూలు కావడం నగర పాలక యంత్రాంగానికి సరికొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. అలాగే తాగునీటి కొళాయి చార్జీలు రూ.7.76 కోట్లు వసూలయ్యాయని అన్నారు.

కరువు కాలంలో ఉపశమనం..!

(5వ పేజీ తరువాయి)

నంద్యాల జిల్లాలో కూడా పలు మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, తెలుగుగంగ, గాలేరు నగరి కాలువల కింద సాగునీటి వసతి ఉన్న మండలాలు కాకుండా ఇతర మండలాల్లో కరువు తీవ్రత అధికంగానే ఉంది. అయితే.. తీవ్ర కరువు మండలాల జాబితాలో కొలిమిగుండ్ల మండలాన్ని మాత్రమే ఎంపిక చేశారు. సాధారణ కరువు మండలాలుగా బేతంచర్ల, బనగానపల్లె, సంజామల, ఉయ్యాలవాడ మండలాలు ఎంపిక చేశారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో వర్షాధారంగా జీవనం సాగించే మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నాయని, వాటిని కూడా ఎంపిక చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాల వాజురీగా కరువు మండలాలు

వివరాలు	కర్నూలు	నంద్యాల
తీవ్రమైన కరువు మండలాలు	9	1
సాధారణ కరువు మండలాలు	1	4
మొత్తం	10	5

కరువు రైతులకు ప్రయోజనం

కరువు మండలాలుగా ఎంపికైన మండలాల్లో ఉపాధి పనులు గరిష్ఠంగా 150 రోజులు పనిదినాలు కల్పిస్తారు. ఒక్కో కుటుంబానికి గరిష్ఠంగా రూ.13,660 అదనపు ప్రయోజనం కలుగుతుంది. వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రయోజనం లభిస్తుంది. పంట రుణాలు రీ షెడ్యూల్ చేస్తారు. వేసవిలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. కరువు నివారణ పంటల సాగుపై ప్రోత్సాహం అందిస్తారు. ఆహార భద్రత కల్పిస్తారు. స్కేల్ ఆఫ్ రిలీఫ్ నిబంధనలు ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్ట పరిహారం అందిస్తారు.

ప్రేమ కోసం పిడకల సమరం

ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో పిడకలతో కొట్టుకుంటున్న గ్రామస్తులు



- 30 నిమిషాల పోరాటం
- సమరంలో 45 మందికి పైగా స్వల్ప గాయాలు
- కర్నూలు జిల్లాలో ఏళ్ల తరబడి వినూత్న ఆచారం

ఆస్పరి మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆస్పరి మండలంలో ప్రతి ఏటా ఓ సంబరం సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. కైరుప్పల గ్రామంలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు పిడకలతో కొట్టుకుంటూ తమ భక్తిని చాటుకోవడం ఇక్కడి ప్రత్యేకత. కైరుప్పల గ్రామంలో భద్రకాళి దేవి, వీరభద్ర స్వామి ఆలయానికి కొన్ని వందల సంవత్సరాల చరిత్ర ఉంది. పిడకల సమరం సోమవారం వేలాది మంది జన సమక్షంలో ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ సమరంలో 45 మందిపైగా స్వల్పంగా గాయపడ్డారు. సంప్రదాయం ప్రకారం కారుమంచి నుంచి పెద్దారెడ్డి వంశస్థుడైన నందకిశోర్ రెడ్డి గుర్రంపై మందీ మార్బలం, మేళతాళాలతో కైరుప్పలకు వచ్చి ఆలయంలోకి వెళ్లి పూజలు చేసి వెనుతిరగగానే ఈ పిడకల సమరం మొదలైంది. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, కాళికాదేవి వర్గీయులుగా గ్రామస్థులు విడిపోయారు. పరస్పరం పిడకలతో దాడి చేసుకున్నారు. వందల సంఖ్యలో పిడకలు గాల్లోకి లేచి ప్రత్యర్థి వర్గంపై పడుతుంటే ఉత్సాహం రెట్టింపైంది. పిడకల దుమ్ము ఆకాశాన్నంటింది. తమను తాము రక్షించుకుంటూ ఎదుటి వారిపై పిడకలు విసురుకుంటూ గుంపులుగా ప్రజలు కదిలారు. ఓసారి ఒక వర్గం వారిది పైచేయి అయితే, ఇంకోసారి మరో వర్గం వారిది పైచేయిగా నిలిచింది. తమవర్గం వారు గెలవాలనే తపనతో మహిళలు పిడకలు అందిస్తూ సాయంగా నిలిచారు. ఒక చోట కుప్పగా వేసిన పిడకలు అయిపోయేంత వరకు అరగంట పాటు ఈ సమరం కొనసాగింది. దెబ్బలు తగిలిన వారు స్వామి వారి విభూది రాసుకున్నారు. మూడు రోజుల్లో ఆ గాయం నయమవుతుందన్న ప్రగాఢ నమ్మకం వారిది. ఈ సమరం ముగిసిన తర్వాత గ్రామపెద్దలు పంచాయితీ చేసి కాళికాదేవి, వీరభద్రస్వామి వారి వివాహానికి అంగీకారం తెలిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు కైరుప్పల చుట్టుపక్కల గ్రామాల పుప్పాలదొడ్డి, వెంగళాయదొడ్డి, కారుమంచి, కల్లపర్రి, పుటకలమర్రి, అలారుదిన్నె, బిల్లేకల్లు, చెన్నంపల్లి, వలగొండ, ఆస్పరితో పాటు తెలంగాణా, కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఇదిలా ఉండగా పిడకల సమరానికి డీఎస్పీ వెంకటరామయ్య, ఆస్పరి సీఐ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 60 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.

ప్రచారంలో ప్రేమ కథ

ఉగాది సమయంలో ఇక్కడ జరిగే పిడకల సమరం వెనుక ఆసక్తికర కథనం ప్రచారంలో ఉంది. త్రేతాయుగంలో భద్రకాళి దేవి, వీరభద్ర స్వామి ప్రేమికులు. వారి మధ్య ప్రేమ వ్యవహారం కాస్త గొడవకు దారితీస్తుంది. పెళ్లి విషయంలో వీరభద్రస్వామి కొంత ఆలస్యం చేస్తారు. దీంతో ప్రేమించి పెళ్లి చేసుకోకుండా. తమ భద్రకాళి దేవిని వీరభద్ర స్వామి మోసం చేశారని అమ్మవారి తరపు భక్తులు నమ్మి వీరభద్ర స్వామిని ఆవు పేడతో తయారు చేసిన పిడకలతో కొట్టి అవమానించాలని చూస్తారు. ఈ విషయం తెలుసుకొన్న వీరభద్ర స్వామి భక్తులు, అమ్మవారు ఉండే ఆలయం వైపు వీరభద్ర స్వామిని వెళ్లవద్దని వేడుకున్నారు. అయినా స్వామివారు ఆలయం వైపు వెళ్లారని, అప్పుడు అమ్మవారి భక్తులు ముందుగా వేసుకున్న ప్రణాళికలో భాగంగా వీరభద్ర స్వామి వారిపై పిడకలతో దాడి చేశారని ఇక్కడి ప్రజల కథనం.



దాడులు చేసుకునేందుకు సిద్ధంగా ఉంచిన పిడకలు



పిడకల సమరాన్ని చూసేందుకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు

గాయమైనా..మూడు రోజుల్లో నయమవుతుంది

పిడకల సమరంలో గాయాలవుతాయి. గాయమైన చోట స్వామివారి విభూతి రాసుకుంటే మూడు రోజుల్లో ఆ గాయం కనబడదు. ఎలాంటి నొప్పి ఉండదు. గాయమైనప్పుడు మాత్రమే నొప్పి ఉంటుందేమో కానీ ఆ తర్వాత ఎలాంటి నొప్పి ఉండదు.

- పవన్ కళ్యాణ్, కైరుప్పల

గాయాలైనా ఏమీ కాదు

పిడకల సమరంలో గాయాలు తగులుతుంటాయి. దెబ్బలు తగిలిన ఎలాంటి ఇబ్బంది ఉండదు. గాయమైన వెంటనే దేవాలయంలోకి వెళ్లి అక్కడ ఉన్న బండారు గాయమైన ప్రదేశంలో రాసుకుంటాము. నొప్పి అనేది ఉండదు. మూడు రోజుల్లో గాయమైన చోట కనీసం మచ్చ కూడా ఉండదు.

- రమేష్, కైరుప్పల

శతాబ్ది బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న రామాలయం కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని పేట శ్రీరామాలయంలో ఏప్రిల్ 12 నుంచి 18 వరకు నిర్వహిస్తున్న ఆలయ శతాబ్ది బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిల్కూరు ప్రభాకర్ తదితరులు పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆదివారం కమిటీ బృందం తొలుత రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను మౌర్యఇన్‌లోని ఆయన కార్యాలయంలో కలిశారు. బ్రహ్మోత్సవాలకు రావాలని మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి బ్రహ్మోత్సవ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ సుమారు 200 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న పేట శ్రీ రామాలయంలో గత తొంభై తొమ్మిది ఏళ్లుగా బ్రహ్మోత్సవాలు కొనసాగాయిని, ఈ ఏడాది అత్యంత వైభవంగా శతాబ్ది బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నామని వివరించారు. అనంతరం వారు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను, కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజులను కలిసి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు.

నంద్యాలలో భారీ చోరీ

- 6 తులాల బంగారు నగలు, అర్ధ కేజీ వెండి, రూ.5.30 లక్షల అపహరణ
- సీసీ కెమెరాల్లో నమోదైన దొంగతనం దృశ్యాలు
- ఆధారాలు సేకరించిన క్లూస్ టీం



చెల్లాచెదరుగా పడేసిన వస్తువులు

నంద్యాల క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం క్రాంతినగర్‌లోని టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాన్ ఇంట్లో దొంగలు భారీఎత్తున చోరీ చేశారు. నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగయ్య యాదవ్ వివరాలివీ.. టైలర్స్ అసోసియేషన్ నంద్యాల శాఖ అధ్యక్షుడు సుభాన్, అతడి కుటుంబ సభ్యులు కోడలి కాన్పు కోసం రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోని బీరువా తాళాలను కూడా పగులగొట్టి అందులో ఉన్న 6తులాల బంగారు నగలు, అర్ధకేజీ వెండితోపాటు రూ.5.30లక్షలను ఎత్తుకెళ్లారు. చోరీ చేసిన వైనం పూర్తిగా సీసీ కెమెరాల్లో నమోదు అయింది. ఇంటి యజమాని సుభాన్ వెంటనే జరిగిన విషయాన్ని నంద్యాల తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ గంగయ్య యాదవ్ నేతృత్వంలో పోలీసులు రంగప్రవేశం చేసి క్లూస్ టీంతో క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. చోరీకి పాల్పడింది చెంచు గ్యాంగ్ పనేనని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

3న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవం సందర్భంగా బనగానపల్లె మండలం నందవరం గ్రామంలో ఏప్రిల్ 3న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రమణారెడ్డి, శివశంకర్ రెడ్డి తెలిపారు. విజేతలకు వరుసగా రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు, నగదు బహుమతులు కల్పించారన్నారు. ప్రవేశ రుసుం రూ.400లు 2వ తేదీలోపు చెల్లించాలన్నారు. జడ్పీహెచ్ఎస్ నందవరం క్రీడామైదానంలో పోటీలు జరిగే తెలిపారు. దాతలు పి.నాగార్జున రెడ్డి, శుభాకర్ రెడ్డి, నాగశశిధర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. వివరాల కోసం 9010958141, 9493421978, 9492613805లను సంప్రదించాలన్నారు.

మహిళ ఆత్మహత్య

భర్త మద్యానికి బానిసయ్యాడన్న మనస్తాపంతో..


మహానంది, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): భర్త మద్యానికి బానిసై మానుకోకపోవడంతో మనస్తాపానికి గురైన వెంకటలక్ష్మమ్మ(48) విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. మండలంలోని ఎం.తిమ్మాపురం గ్రామానికి చెందిన చిన్న వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మమ్మ భార్యాభర్తలు. మద్యాం తాగడం మానుకోవాలని మహిళ తన భర్తను పలుమార్లు కోరింది. అయినా అతడు వినకపోవడంతో మనస్తాపానికి గురైన మహిళ ఆదివారం రాత్రి విష ద్రావణాన్ని తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. సోమవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇదో రకం వసూలు..!

- ఈకేవైసీ కోసం బలవంతపు వసూళ్లు
- ప్రతి ఈకేవైసీకి రూ. 50ల డిమాండ్



కర్నూలులో లబ్ధిదారు నుంచి డబ్బులు వసూలు చేస్తున్న డీలర్‌కు సంబంధించిన వ్యక్తి




చౌక దుకాణం

కర్నూలు కలెక్టరేట్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలోని ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. కేంద్ర ఆదేశాలనుసారం రేషన్‌కార్డులోని ప్రతి సభ్యుడు ఈకేవైసీ ఉండాలి. ఈ మేరకు జిల్లాలోని ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డులోని సభ్యుడు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలి. అందుకు ఏప్రిల్ 30వ తేదీలోపు ఈకేవైసీ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 6,71,086 కార్డుదారులు, చౌకదుకాణాలు 1,233, ఎండీయూ వాహనాలు 275 ఉన్నాయి. జిల్లాలోని కొంత మంది రేషన్ డీలర్లు, ఎండీయూలు ఈకేవైసీ పూర్తికాని వారితో రూ.50 దాకా వసూలు చేస్తున్నారు. వీరిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే దాడులు చేయడానికి కూడా వెను కాడటం లేదు. 'మీరు మాపై అధికారులకు ఎవరికైనా ఫిర్యాదు చేసినా కూడా మాకు ఎటువంటి ఇబ్బంది లేదు' అంటూ కొందరు రేషన్ డీలర్లు బహిరంగంగా చెబుతున్నారు.

ప్రచారం శూన్యం

జిల్లాలోని డివిజన్ స్థాయిలో ఎండీయూ, రేషన్ డీలర్లతో సివిల్ సప్లైస్ అధికారులు సమావేశాలు నిర్వహించడం లేదని విమర్శలు న్నాయి. ఈకేవైసీ పూర్తి చేయని వారి సంబంధిత లిస్టును వార్డు, గ్రామ సచివాలయ అధికారులకు పంపించారు. గ్రామ పట్టణాల్లో ఎంతో మంది చదువుకుని నిరక్షరాస్యులుగా ఉన్నారు. మరికొందరు విభిన్న ప్రతిభావంతులు ఉన్నారు. అలాంటి వారికి ఈకేవైసీపై అవగాహన లేదు. దీంతో వీరు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.

ఈకేవైసీ పూర్తిగా ఉచితం



జిల్లాలో ఈకేవైసీ పూర్తి చేయని వారు ఏప్రిల్ 30లోపు చేయాలి. డీలర్లు, ఎండీయూలు రుసుం వసూలు చేయకూడదు. ఇది పూర్తిగా ఉచితం. ఎవరికైనా అలా రేషన్‌కార్డు సభ్యుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వచ్చినట్లయితే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- రాజారఘువీర్, డీఎస్‌వో


ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం


ఓర్వకల్లు ఈద్గాలో ప్రార్థనలు..


కోడుమూరు ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఘనంగా రంజాన్



కర్నూలు జిల్లాల్లో సోమవారం 'ఈద్-ఉల్-ఫితర్' (రంజాన్) వేడుకను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్ చేశారు. మతపెద్దలు ప్రార్థనలు చేయించి, దైవ సందేశం అందించారు. ఈ ప్రార్థనల్లో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు చట్ట సవరణ బిల్లుకు నిరసనగా నల్లబ్యాడ్జిలు ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు.




తడకనపల్లె ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


గూడూరులో ప్రార్థనలకు వస్తున్న ముస్లింలు


కర్నూలులో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

కర్ణాటక భక్తులకు అన్నదానం


సోమయాజులపల్లెలో కర్ణాటక భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న దాతలు

ఓర్వకల్లు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక రాష్ట్రం భక్తులు ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణంలో మహానంది క్షేత్రాన్ని సందర్శించి స్వగ్రామాలకు వెళ్తున్న సందర్భంగా మండలంలోని సోమయాజులపల్లె బస్టాండు సమీపాన దాతలు యాగంటయ్య, నర్సరీ రమణ, ఆనంద్, రామచంద్రుడు ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొమరోలు సోమయాజులపల్లె ప్రజలు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో నిరసన


మాట్లాడుతున్న కాకి ప్రకాశ్‌రావు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ఏప్రిల్ 2వ తేదీన మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు నిరసన కార్యక్రమం నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సోమవారం ఎస్టీయు భవన్‌లో రాష్ట్ర, జిల్లా నాయకులతో ఫ్యాప్టో ఛైర్మన్ సేవాలాల్ నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఫ్యాప్టో రాష్ట్ర కో ఛైర్మన్ కే.ప్రకాశ్‌రావు, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు జి.హృదయరాజు హాజరయ్యారు. రాష్ట్ర కో ఛైర్మన్ కే.ప్రకాశ్‌రావు మాట్లాడుతూ కరోనా కాలం నుంచి మరణించిన ఉపాధ్యాయ, ఉద్యోగుల పిల్లలకు ఇవ్వాల్సిన కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జి.హృదయరాజు మాట్లాడుతూ డీఏ బకాయిలు చాలా ఉన్నాయని, వాటిని వెంటనే ప్రకటించాలని, సరెండర్ లీవ్ బకాయిలు 2022 నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొన్నింటిని చెల్లించినా కూడా చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సేవాలాల్ నాయక్, భాస్కర్, రంగన్న, రవికుమార్, నవీన్ పాటిల్, గోకారి, జనార్దన్, శ్రీనివాసరెడ్డి, వెంకటరాముడు, నందీశ్వరుడు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ


మునగాలలో విగ్రహానికి పూజలు చేస్తున్న వాల్మీకులు

గూడూరు, మార్చి 31: మండలంలోని మునగాల గ్రామంలో బస్టాండ్ దగ్గర నూతనంగా నిర్మించిన శిలావేదిక మందిరంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. మునగాల వాల్మీకి పెద్దలు, యువకులు, మహిళలు ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని వాల్మీకిని దర్శించుకోని పూజలు నిర్వహించారు.

వక్ఫ్ చట్ట సవరణ రద్దు కోసం నల్ల రిబ్బన్లతో నిరసన

● పండుగ రోజు ముస్లింల వ్యతిరేకత


నల్లరిబ్బన్లు ధరించి నమాజుకు వచ్చిన ముస్లింలతో మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



కర్నూలు న్యూసిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలని ముస్లిం పర్సన్‌లా బోర్డు పిలుపు మేరకు రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు చేతికి నల్లరిబ్బన్లు ధరించిన నిరసన తెలిపారు. సోమవారం ఆవాజ్ కమిటీ అధ్వర్యంలో జొహరాపురం ఈద్గా, పాత ఈద్గా, జామియా మసీదు వద్ద ముస్లింలకు కమిటీ నాయకులు నల్ల రిబ్బన్‌లను పంపిణీ చేశారు. కమిటీ కార్యదర్శి అబ్దుల్ దేశాయ్ మాట్లాడుతూ నమాజ్ సందర్భంగా నల్ల రిబ్బన్లతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు నిరసన తెలిపామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎండీ.షరీఫ్, ఖాజా పాషా, మహబూబ్ భాష, షేక్షావలి, ఖలీల్, గౌస్‌బాష తదితరులు పాల్గొన్నారు.

● ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. పండుగ రోజు ముస్లిందరూ వక్ఫ్ చట్ట సవరణ చేయాలని నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారన్నారు. ఐకమత్యంతో శాంతియుతంగా నల్లరిబ్బన్లు ధరించారన్నారు

పత్తి ఓబులయ్యను అభినందించిన మంత్రి



పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉగాది పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కళారత్న (హంస) పురస్కారం అందుకున్న టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్యను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అభినందించారు. ఆదివారం మౌర్య ఇన్‌లోని మంత్రి కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో పత్తి ఓబులయ్య పురస్కార వివరాలు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా టీజీ భరత్ పత్తి ఓబులయ్యను ప్రశంసిస్తూ జిల్లా నాటక రంగ చరిత్రలో తొలిసారిగా కళారత్న (హంస) పురస్కారం సాధించడం అభినందనీయమని చెప్పారు. పత్తి ఓబులయ్య ఐదు దశాబ్దాలుగా నాటక రంగానికి అందిస్తున్న సేవలకు ప్రతిఫలంగా ఈ పురస్కారం అందుకొని ఔత్సాహిక కళాకారులకు మార్గదర్శకంగా నిలిచారని చెప్పారు.

సత్కరించిన మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉగాది పండుగ రోజున రాష్ట్ర ప్రభుత్వ కళారత్న (హంస) పురస్కారం అందుకోవడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం మౌర్య ఇన్‌లోని ఆయన ఛాంబర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్యను శాలువతో ఘనంగా సత్కరించారు. హంస పురస్కారాల కార్యక్రమ వివరాలు తెలుసుకొన్నారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు కళా, సాహి త్య రంగాలకు పెద్దపీట వేస్తోందని చెప్పారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడిగా, నాటక దర్శకునిగా, కళారంగానికి చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం హంస పురస్కారం పత్తి ఓబులయ్య అందజేయడం జరిగిందని ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం ఎర్రమ పాండురంగయ్య, రంగస్థల కళాకారులు గాండ్ల లక్ష్మన్న, జీవీ శ్రీనివాసరెడ్డి, వీవీ రమణారెడ్డి, రాజారత్నం, పాండురంగయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పోలీసుల భారీ బందోబస్తు


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ఆయా దర్గాలు, మసీదులు, ఈద్గాల ప్రార్థనల వద్ద గట్టి చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముస్లిం ప్రార్థనలు ముగిసేంత వరకు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి తెలిపారు. మంగళవారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సెంట్రల్ సెక్షన్ పరిధిలోని యూకాన్ ప్లాజా ఫీడర్ పరిసరాల్లో కరెంట్ కోత ఉంటుందన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

తైక్వాండోలో బంగారు పతకం

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా తెనాలిలో ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి అస్మిత్ ఖేలో ఇండియా జూనియర్ అండర్-49 కేజీల విభాగంలో తమ కళాశాల ఐఐటీ విద్యార్థిని సుగంధిని బంగారు పతకం సాధించిందని జోనల్ ఇన్‌చార్జి రఘువీర్ తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్, కోచ్ జి.షబీర్ హుశేన్‌లు అభినందనలు తెలియజేసి శాలువ, మెమెంటో అందజేసి సత్కరించారు.

గేట్‌లో కర్నూలు వాసి ప్రతిభ

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన గేట్ ప్రవేశ పరీక్షలో కర్నూలుకు చెందిన గొల్ల రాజశేఖర్ ఆల్ ఇండియా స్థాయిలో ఓపెన్ కేటగిరిలో 1205వ ర్యాంకు సాధించారు. కర్నూలు నగరంలోని చెక్‌పోస్టు సమీపంలో నివాసముంటున్న తెలుగు ఉపాధ్యాయుడు జి. నాగేంద్రుడు కుమారుడు రాజశేఖర్ కర్నూలు శ్రీచైతన్య పాఠశాలలో 10వ తరగతి వరకు, హైదరాబాదులో నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించారు. జేఈఈ-మెయిన్స్ ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించి ఆంధ్రప్రదేశ్ కొత్తగూడెం నిట్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ఇటీవల విడుదలైన గేట్ ప్రవేశ పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 1205వ ర్యాంకు సాధించారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట


హద్దుల్లో కందకాలను తవ్విస్తున్న అటవీ సిబ్బంది

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని వెంగనబావి, పుల్లయ్య పార్కు వెంబడి అక్రమంగా ఇసుకను తరలిస్తుండడంతో అటవీశాఖ సరిహద్దుల వద్ద పెద్ద ఎత్తున కందకాలను తవ్వించారు. ఈ కందకాల వల్ల అక్రమ ఇసుక వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట వేసినట్లు అయింది. సోమవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. అయితే ట్రాక్టర్ల డ్రైవర్లు అధికారులను లెక్కచేయకుండా వెళ్లిపోవడంతో వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఫారెస్టు రేంజ్ అధికారి విజయకుమార్ తెలిపారు.

కొత్తపేటలో తాగునీటి ఇబ్బందులు

● ట్యాంకర్లతో నీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని 50వ వార్డు కొత్తపేటలో తాగునీటి సరఫరాలో అంతరాయం కలిగింది. వార్డులో ఒక చోట మరమ్మతులు ఉండడంతో నీటి సరఫరాలో అంతారయం ఏర్పడింది. ఈ క్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి బోయ మణిష్‌నాయుడు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయించారు. దీంతో ప్రజలు పండుగ రోజు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని పట్టుకున్నారు.

7న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా పంచలింగాలలో ఈ నెల 7వ తేదీన అంతర్ రాష్ట్ర స్థాయి పురుషుల ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.150లు చెల్లించాలన్నారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు పోటీలు ప్రారంభిస్తారనీ తెలిపారు. వివరాలకు 8341448574, 9502088082, 9849690585లను సంప్రదించాలన్నారు.

● 6న ఓపెన్ క్రికెట్ పోటీలు

గుడ్ ఫ్రైడే సందర్భంగా ఈ నెల 6న లొద్దిపల్లె గ్రామంలో ఓపెన్ టూ ఆల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు రూ.30వేలు, రూ.20వేలు నగదు బహుమతులు కల్పించామని నిర్వాహకులు కర్ల కిరణ్, మహేష్‌లు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.800లు చెల్లించాలన్నారు. వివరాలకు 7780478410, 9000501168, 8074670001లను సంప్రదించాలన్నారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న లోకాయుక్త


సంగమేశ్వరంలో కర్నూలు లోకాయుక్త జస్టిస్ దంపతులకు పూర్ణకుంభ స్వాగతం పలుకుతున్న పురోహితుడు

కొత్తపల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాతీరం నుంచి ఇటీవల బయల్పడిన సప్తనదుల సంగమేశ్వరున్ని కర్నూలు లోకాయుక్త జస్టిస్ రజిని దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం సంగమేశ్వరున్ని దర్శించుకునేందుకు వచ్చిన జడ్జి దంపతులకు ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ ఘనంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారికి క్షేత్ర సన్నిధిలోని లలితా సంగమేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి సంగమేశ్వర స్వామి ఆలయ చరిత్ర గురించి జడ్జి దంపతులకు పురోహితులు వివరించారు. అనంతరం జస్టిస్ దంపతులు కొలను భారతి అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ పురోహితులు అమ్మవారి జ్ఞాపికను, శేషవస్త్రం అందజేశారు.


వెంకటగిరిలో గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం

ఘనంగా గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం

● ఉత్సాహంగా జరిగిన పరుగు పందెం పోటీలు ● ఆసక్తిగా తిలకించిన ప్రజలు


ప్యాలకుర్తిలో చేపట్టిన పరుగుపందెం

కోడుమూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరిలో ఉగాది ఉత్సవాల్లో భాగంగా సోమవారం గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో అభిషేకాలు, ఆకుపూజ, పుష్పార్చన చేపట్టారు. పట్టువస్త్రాలు, పూలమాలలతో స్వామిని అలంకించారు. మధ్యాహ్నం ఎద్దులబండికి ఏర్పాటు చేసిన ప్రభను సుందరంగా అలంకరించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత విష్ణుమూర్తి ఉత్సవవిగ్రహాలను కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఎదురుమండపం వరకు ఊరేగించారు. సాయంత్రం స్వామివారి పారువేట ఉత్సవం నిర్వహించారు. అలాగే వర్కూరులో లక్ష్మీమాధవస్వామికి గ్రామోత్సవ అనంతరం వసంతోత్సవం జరిపించారు.

● **పరుగుపందెం పోటీ:** ఉగాది వేడుకలలో భాగంగా ప్యాలకుర్తి, లద్దగిరి గ్రామాల్లో సోమవారం యువతకు పరుగుపందెం పోటీ చేపట్టారు. పరుగు పందెంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్యాలకుర్తిలో సుధాకర్, భరత్ విజేతలుగా నిలువగా రూ. 5 వేలు, రూ. 3 వేలు నగదు బహుమతి అందించారు. లద్దగిరిలో నాగరాజు, రామక్రిష్ణ విజేతలుగా నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు పొట్టేళ్లు బహుమతిగా ఇచ్చారు.

ముమ్మరంగా బకాయిల వసూళ్లు


సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ కృష్ణ

ఆదోని టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజు కూడా పట్టణంలో కమిషనర్ ఆస్తి పన్నుల వసూళ్లను ముమ్మరం చేశారు. సోమవారం రంజాన్ ఉన్నా ఉదయమే సిబ్బందిని కార్యాలయ ఆవరణలో సమావేశపరిచి, గ్రూపులుగా ఏర్పాటు చేసి పన్ను వసూళ్లకు పురమాయించారు. ఆస్తిపన్నుపై ప్రభుత్వం ప్రకటించిన 50శాతం వడ్డీ మాఫీ చివరి రోజు కావడంతో రాత్రి 11 గంటల వరకు కౌంటర్లు అందుబాటులో ఉంటాయని, కనీసం రూ.50 లక్షల వరకూ పన్నులను వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

హోరాహోరీగా రాతిదూలం పోటీలు


మదనంతపురంలో రాతిదూలం పోటీలు

మద్దికెర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంతపుర గ్రామంలో ఉగాది సందర్భంగా రైతులు రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉగాది ముగిశాక పొలం పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తా

- దీక్ష విరమించిన చైర్‌పర్సన్ శాంత


దీక్ష విరమిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత

ఆదోని టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీ వారే తనకు చేసిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ శాంత అన్నారు. భీమస్ కూడలిలో 12 రోజులుగా చేపట్టిన రిలే దీక్షలను సోమవారం సాయంత్రం ఆమె విరమించారు. శాంత మాట్లాడుతూ తన భర్త సింహం నాగేంద్ర బీజేపీలో చేరడంతోనే తనపై అవిశ్వాస తీర్మానం పెట్టినట్లు జగన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్యే సాయి వైఖరితోనే తన భర్తే నాగేంద్ర బీజేపీలోకి చేరారన్నారు. తాను మంగళవారం నుంచి వార్డుల ప్రజలను కలిసి, అవిశ్వాస తీర్మానం వెనుక జరిగిన కుట్రను ప్రజలకు వివరిస్తానని, నిజం పార్టీ అధ్యక్షుడు జగన్‌కు చేరే వరకూ తన పోరాటం ఆగదని తెలిపారు.

సేవాగుణం అలవర్చుకోవాలి


మందులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మద్దికెర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు, ఆర్‌ఎంపీ వలిసాహెబ్ అన్నారు. సోమవారం మద్దికెర గ్రామ శివారులో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్తిక్ రెడ్డి, ఆంజనేయులు ఉన్నారు

ఆకతాయిలను వదలొద్దు

- శక్తి టీం సూపర్‌వైజర్, సీఐ విజయలక్ష్మి


శక్తీటీం సభ్యులతో మాట్లాడుతున్న సీఐ విజయలక్ష్మి

ఆదోని రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలు, విద్యార్థినులను వేధించే ఆకతాయిలను వదిలిపెట్టొద్దని, శక్తి టీం సూపర్‌వైజర్, కర్నూలు మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ విజయలక్ష్మి సూచించారు. సోమవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శక్తీటీంతో సమావేశం ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్ పరిధిలో ఆరుమందితో శక్తీ టీం పనిచేస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 30 శక్తీ టీంలు ఉన్నాయని, రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల వద్ద మఫ్టీలో గస్తీ తిరుగుతూ ఆకతాయిల ఆట కట్టిస్తారని తెలిపారు. శక్తి ఎస్‌వోఎస్ యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు.

వర్షాలు కురిసి పంటలు పండుతాయి

- వేద పండితుల పంచాంగ పఠనం


జొన్నగిరిలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు

తుగ్గలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది విశ్వావసు నామ సంవత్సరంలో వర్షాలు కురిసి, పంటలు బాగా పండుతాయని పండితులు శాస్త్రి తెలిపారు. సోమవారం జొన్నగిరి గ్రామం వేణుగోపాల స్వామి ఆలయంలో వేద పండితులు పంచాంగ పఠనం చేశారు. సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి, సొసైటీ సీఈవో గిడ్డయ్య, టీడీపీ నాయకులు మిద్దె రవికుమార్, పెద్ద తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్

- నియోజకవర్గాల్లో వేడుకలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శుభాకాంక్షలు తెలిపిన నాయకులు


ఆదోని జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు


శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు


దేవనకొండలో ప్రార్థనలు

ఆదోని/అగ్రికల్చర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ముస్లింలు సోమవారం రంజాన్‌ను భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. నెలరోజులు ఉపవాసాలు చేసి, పట్టణంలోని పురాతనమైన చారిత్రాత్మక జామియా మసీదులో నమాజ్ చేశారు. ఉదయం నుంచే మసీదులు, దర్గాల వద్దకు ముస్లింలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఇమాంలు వారితో ఖరాన్ చదివి వినిపించారు. ఒకరికొరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు, కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప శుభాకాంక్షలు తెలిపారు.

ఆదోని రూరల్: మండలంలోని పెద్దపెండేకల్లు, పెద్దతుంబళం, ఇస్వీ, పెద్దహరివాణం, తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను చేసుకున్నారు. మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఒకరికొకరు శుభాకాంక్షలు లుపుకున్నారు.

పేదరిక నిర్మూలనే నిజమైన రంజాన్

హొళగుంద: పేదరిక నిర్మూలనే నిజమైన రంజాన్ అని మౌలాన హబీబుల్లా జామయి సోమవారం అన్నారు. హొళగుందలోని మసీదుల్లో ముస్లింలు నమాజ్ చేశారు. డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్సై దిలీప్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు. గజ్జహల్లి, వందవాగాలి, ఇంగళదహాళ్, ఎల్లార్తి, హెబ్బటం, ఎండీ హళ్లి, సులువాయి, నేరణికి తండాలో వేడుకలు చేశారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

ఆలూరు: మండలంలో ముస్లింలు రంజాన్‌ను సంతోషంగా నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ విశిష్టతను తెలియజేశారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దేవనకొండ: మండలంలో ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలు ఆదవారంతో ముగి శాయి. సోమవారం ఉదయం ఈద్గా వద్దకు చేరుకొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మతపెద్దలు పండుగ విశిష్టత తెలిపి, సమాజంలో శాంతిని నెలకొల్పాలని సూచించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాల్లో ముస్లింలు రంజాన్‌ను నిర్వహించారు. ఉదయాన్నే మసీదులో నమాజ్ అనంతరం ఈద్గాకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పత్తికొండ టౌన్: పట్టణంలో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు నిర్వహించారు. నెల రోజులు ఉపవాసదీక్ష చేసి, సోమవారం రంజాన్ సందర్భ ంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ శుభాకాంక్షలు తెలిపారు

నల్లబ్యాడ్జిలతో ముస్లింల నిరసన

పత్తికొండ టౌన్: వక్ఫ్‌బోర్డు చట్టసవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం పత్తికొండలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించారు. ముస్లింల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సాబుద్దీన్, నూర్ బాషా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నూర్‌బాషా, ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ మైనార్టీలకు ముప్పుగా భావించే వక్ఫ్‌బోర్డు సవరణను కేంద్ర ప్రభుత్వం పునఃపరిశీలించి తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. హాజీ షేక్షావలి, మహబూబ్ బాషా, హుశేన్‌షా, రహంతుల్లా పాల్గొన్నారు.


తుగ్గలి: రాంపురం కొట్టాలలో మతపెద్ద ప్రసంగం


మద్దికెరలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం


పత్తికొండలో నల్ల బ్యాడ్జీలతో నిరసన


ఆలూరు ఈద్గాలో నమాజ్ చేస్తున్న భక్తులు

తుగ్గలి: మండలంలోని రాంపురం కొట్టాల, హుశేనాపురం, జొన్నగిరి, తుగ్గలి గ్రామాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పేదలకు సాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచులు కమల్, మస్తాన్‌బీలు, సుల్తాన్, హుశేన్, తదితరులు ఉన్నారు.

హాలహర్వి: ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ విశిష్టతను తెలియజేశారు. ప్రార్థనలు అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వైభవంగా వసంతోత్సవం


ఆలూరులో రంగులు చల్లుకుంటున్న యువకులు, పిల్లలు


హాలహర్వి: గూళ్యంలో యువకుల కేరింత

- రంగులు చల్లుకున్న పిల్లలు, యువకులు, మహిళలు,

ఆదోని రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది ఉత్సవాలు సోమవారం వసంతోత్స వంతో ముగిశాయి. గ్రామాల్లో పండుగ వాతా వరణం కనిపించింది. యువతీ యువకులు, పెద్దలు రంగులు చల్లుకుని, సంబరాలు చేసుకున్నారు. పెద్దతుంబళం, ఇస్వీ, తాలుక ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు.


పత్తికొండ టౌన్ : హోసూరులో వసంతోత్సవం


ఆదోని రూరల్ : నాగలాపురంలో రంగులాట

వసంతోత్సవ వేడుకలు

పత్తికొండ టౌన్: మండలంలోని హోసూరు గ్రామంలో సోమవారం ఉగాది వసంతోత్సవ వేడుకలు చేసుకున్నారు. పారువేటలో భాగంగా గ్రామంలో ఎద్దుల బండ్లను అలంకరించి, డ్రమ్ముల్లో రంగు నీళ్లు ఉంచి, రంగులు చల్లుకున్నారు.

ఘనంగా వసంతోత్సవం

ఆలూరు: ఉగాది మరుసటి రోజు చేసే వసంతోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. మండలంలోని గ్రామాల్లో పిల్లలు మొదలుకొని పెద్దల, మహిళలు రంగులు చల్లుకున్నారు. యువకులు కేరింతలు కొడుతూ, డ్యాన్స్ వేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు.

రంగుల వసంతోత్సవం

హాలహర్వి: మండలంలో వసంతోత్సవం వైభవంగా సాగింది. గూళ్యంలో యువకులు కేరింతలతో రంగులు పూసుకున్నారు.

వేడుకలో ఘర్షణ

- నలుగురికి గాయాలు


ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడుతున్న సీఐ

ఆలూరు రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరకట్టు గ్రామం వసంతోత్సవ వేడుకల్లో ఘర్షణ చోటు చేసుకుంది. సోమవారం సాయంత్రం ఇరువర్గాల మధ్య మాట మాట పెరిగడంతో ఓ వర్గం వారు మరో వర్గంపై దాడికి దిగారు. లక్ష్మి, చిన్న, ఎల్లప్ప, జయలక్ష్మి అనే వ్యక్తులు గాయపడ్డారు. వీరిని ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమపై బోయ సురేష్, బోయ శీను, బోయ పురుషోత్తం, గిరిశం దాడి చేశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రవిశంకర్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని, బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవి శంకర్ రెడ్డి తెలిపారు.

ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలపై హర్షం

ఆదోని టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి రూ. 1.33 కోట్లతో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం పట్ల ఆసుపత్రుల సలహా మండలి మాజీ సభ్యుడు నసీరుద్దీన్ పటేట్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మాట్లాడుతూ శ్మశాన వాటికకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారిందన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి

- ఆదోని క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు జోసెఫ్ జాషువా


మాట్లాడుతున్న జోసెఫ్ జాషువా విక్లిఫ్

ఆదోని అగ్రికల్చర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దైవ వర్తమానికుడు పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్రమైన దర్యాప్తు చేసి, నిజాలను బయటపెట్టాలని ఆదోని క్రిస్టియన్ ఫోరం అధ్యక్షుడు పాస్టర్ జోసెఫ్ జాషువా విక్లిఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని రాంజల రహదారిలోని సీఆర్‌చర్చి ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పాస్టర్ మృతి క్రైస్తవ సమాజానికి అనుమానాలకు తావిస్తోందన్నారు. క్రైస్తవ గొంతు వినిపించి, సమాజంలోని లోపాలను ఎత్తి చూపిన ప్రవీణ్ సాంఘిక దురాచారాలను ఖండించారన్నారు. ఆయన మృతి క్రైస్తవ సమాజాన్ని దుఃఖంలోకి నెట్టిందని ఆవేదని వ్యక్తం చేశారు ఘనట జరిగిన తీరుతో హత్యగా అనుమానిస్తున్నామన్నారు. కొందరు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అవాస్తవాను వైరల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. అల్లరి మూకలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తున్నారని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏసీసీఎఫ్ ప్రధాన కార్యదర్శి పాస్టర్ అంథోని ఉపాధ్యక్షుడు యేసురాజ్, ట్రెజరర్ శేఖం దేవదాస్, తిమోతి, ఆర్ ప్రకాష్, సజీవరాజు, రాజశేఖర్, జయరాజు, వైపీ డేవిడ్, సుందర్ సింగ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- కలిసిన 1996-97 బ్యాచ్ విద్యార్థులు

మద్దికెర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి జడ్పీ పాఠశాలలో 1996-97 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. మిత్రులు యోగక్షేమాలు తెలుసుకున్నారు. తమ స్నేహితుడు జానే రాజశేఖర్‌కు సెక్రటరేటియట్‌లో అసిస్టెంట్ ఎక్స్‌పర్ట్‌గా పదోన్నతి రావడంతో సన్మానించారు.

తుగ్గలి ఎంపీపీకి సన్మానం

పత్తికొండ టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలాధ్యక్షురాలిగా ఎంపికైన రామాంజనమ్మను పత్తికొండలో సన్మానించారు. సోమవారం ఎంపీపీ తన భర్త శభాష్‌పురం హనుమంతుతో పాటు కేడీసీసీ మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మను కలిశారు. నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, కాలహస్తి సుంకన్న, టైలర్ వెంకటేశ్వర రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, కన్వీనర్ గోపాల్ రెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

ఏబీవీపీ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీరామ్

ఆదోని అగ్రికల్చర్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది సందర్భంగా ఏబీవీపీ ఆధర్యంలో క్యాలెండర్‌ను వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ విడుదల చేశారు. జిల్లా కన్వీనర్ వీరేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ వాదం దేశభక్తిని పెంపొందిస్తున్నా మని తెలిపారు. నాయకులు గోవింద్ రాజ్, ఉమామహేష్ పాల్గొన్నారు.

నేలపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- భయాందోళనలో ప్రజలు


నేలపై వదిలేసిన విద్యుత్ మెయిన్ సర్వీస్ తీగలు

హాలహర్వి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్ధగేరి గ్రామంలోని జగనన్న కాలనీలో విద్యుత్ మెయిన్ లైన్ సర్వీస్ తీగలు నేలపైనే వదిలేశారు. దీంతీ కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్ కో అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంతో వణికిపో తున్నారు. కాలనీలో ప్రభుత్వం గృహాలు నిర్మిస్తోందని, వాటిని నీటి క్యూరింగ్ చేయాలంటేనే వణుకు పుడుతోందని అంటున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలు ఏర్పాటు చేసి, తీగెలను వాటిపైకి లాగాలని కోరుతున్నారు.

చలివేంద్రాలు ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బుట్టా నీలకంఠ

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్, సోమేశ్వర సర్కిల్, బడెసాబ్ దర్గా దగ్గర, ఎంబీ చర్చి సమీపంలో బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను బుట్టా నీలకంఠ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తరచూ నీరు తాగాలన్నారు. పని ఉంటే తప్ప బయట తిరగరాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్, విరుపాక్షిరెడ్డి, యూకే రాజశేఖర్, సునీల్, నాగేషప్ప పాల్గొన్నారు.

'జీవోను రద్దు చేయించాలి'

మంత్రాలయం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేసి జూనియర్ లెక్చరర్లకు ప్రమోషన్ల కోసం అడ్డుగా ఉన్న జీవో.నెం.223ను రద్దు చేయించాలని జూనియర్ లెక్చరర్స్ ప్రమోషన్స్ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం ఆచారి, రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్ కోరారు. సోమవారం మంత్రాలయంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్నను సన్మానించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నో పోరాటాలు, నిరసనలు తెలియజేశామని, కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ఉందన్నారు. గతంలో పవన్ కళ్యాణ్‌ను కలిసి తమ కష్టాలను తెలియజేశామని, ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా డిప్యూటీ ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరారు.

రూ. 8.55 కోట్ల ఆస్తి పన్ను వసూలు

ఎమ్మిగనూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పురపాలక సంఘం పరిధిలో మార్చి చివరి నాటికి ఆస్తి, నీటి పన్నులు రూ. 8.45 కోట్లు వసూలు అయ్యాయి. మార్చి నెల చివరి రోజుల్లో ఉగాది, రంజాన్ పండుగల సెలవులు వచ్చినప్పటికీ ప్రభుత్వం పన్నువసూలు కోసం మున్సిపాలిటీలో ప్రత్యే కౌంటర్లు ఏర్పాటు చేసింది. మార్చి చివరి రోజు 31న ఆస్తిపన్ను రూ. 8.30కోట్లకు గాను రూ. 6.10 కోట్లు వసూలైంది. అలాగే నీటి పన్ను రూ. 4.45కోట్లకు గాను రూ. 2.45కోట్లు వసూలు అయినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఆస్తి బకాయిదారులకు వడ్డీలో 50శాతం రాయితీ ఇవ్వటంతో చివరిరోజు రూ.14 లక్షలు వసూలు కావటం విశేషం. కమిషనర్ గంగిరెడ్డి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి సిబ్బంది, అధికారులను అప్రమత్తం చేయటంతో అధికంగా వసూలు చేశారు.

గడ్డివాములు దగ్ధం


మంటలను ఆర్పుతున్న గ్రామస్థులు

ఎమ్మిగనూరు రూరల్, మార్చి31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్లదిన్నెలో సోమవారం ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో అప్రమత్తమైన గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రెండు ఎద్దులతో పాటు ఓ గేదెకు సైతం మంటలు తగిలి రక్తగాయాలయ్యాయి. దాదాపు రూ.లక్ష వరకు నష్టమైనట్లు బాధితులు పెద్ద ఈరన్న, చిన్న ఈరన్న తెలిపారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.


యువకుడి ఆత్మహత్య


వీరనాగుడు (ఫైల్)

పెద్దకడుబూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హెచ్.మురవణి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీకి చెందిన కురువ వీరనాగుడు (24) ఆదివారం రాత్రి ఇంటిలో భోజనం చేసి పెద్దకడుబూరు మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో ఉన్న పొలానికి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి వీరనాగుడు ఇంటికి రాకపోవడంతో పలు చోట్ల వెదికారు. బంధువులు పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పెద్దకడుబూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వీరనాగుడు మృతికి తల్లిదండ్రులు, గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


కౌతాళంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


మంత్రాలయం: రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి


గోనెగండ్ల ఈద్గా దగ్గర ప్రవక్త బోధనలను వివరిస్తున్న ముజావర్

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఎమ్మిగనూరు/మంత్రాలయం/కౌతాళం/గోనెగండ్ల/కోసిగి/ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు,మార్చి31 (ఆంధ్రజ్యోతి):
ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల పరిధిల్లో ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనాలు చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కులమతాలకతీతంగా ముస్లిం సోదరులకు ప్రజలందరూ పండుగ శుభాకాంక్షలు తెలిపి వారితో ఆనందం పంచుకున్నారు. మాధవరం ఈద్గాలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మిగనూరులో మతగురువు సయ్యద్ మహ్మద్ ఉసేని ఉసేని ఖాద్రీ తాహరి షర్ఫీ ప్రార్థనలు చేయించారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి టీడీపీ ప్రభుత్వం తరఫున రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పట్టణంలోని పలువురి ఇళ్లకు వెళ్లారు. అలాగే వైసీపీ నాయకులు బుట్టా నీలకంఠ, వై రుద్ర గౌడ్, జగన్మోహన్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాచాని సోమనాథ్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహ్మద్, ముస్లిం నాయకులు శాబీర్, రియాజ్, ముల్లీ కలీముల్లా, నవజ్, గుల్లా సలాం, సలీం, ఫారుక్, జాగీర్‌దార్‌లు పాల్గొన్నారు.


ఉపదేశం ఇస్తున్న మతగురువు


కోసిగిలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి


ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

రాఘవేంద్రస్వామి ఆలయంలో భక్తుల రద్దీ

మంత్రాలయం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాంకరణ సేవ చేశారు. సోమవారం శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. పీఠాధిపతి పూజలు, చేసి మంగళహారతులు ఇచ్చారు.

●మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం శ్రీశైలం నుంచి వచ్చిన కర్ణాటక భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని భక్తులు శ్రీమఠం పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది.

● వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల హర్షధ్వనుల మధ్య మూలరాములకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అభిషేకం చేశారు. సోమవారం విదియ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని పూర్ణబోధ పూజామందిరంలో వెండి మంటపంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు అభిషేకం చేశారు. క్షీరాభిషేకం, తులసి అర్చన, పుష్పాభిషేకం, స్వర్ణ నాణేలతో అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు పాదపూజ చేసి బంగారు, నవరత్నాల రథాలపై స్వామివారు ఊరేగింపు నిర్వహించారు.కార్యక్రమంలో పండిత కేసరి రాజా ఎస్ గిరిరాజాచార్, మేనేజర్లు శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోణాపూర్, సూపర్నిండెంట్‌లు రవి కులకర్ణి, అనంత పురాణిక్, విజయేంద్ర ఆచార్, జయతీర్థ ఆచార్‌లు పాల్గొన్నారు.


శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

నల్లబ్యాడ్జీలతో నిరసన

గోనెగండ్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని గోనెగండ్ల ముస్లీంలు డిమాండ్ చేశారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించే ఈద్గా దగ్గర నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ముస్లిం సంఘం నాయకులు, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ మన్సూర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా వక్ఫ్ చట్టాన్ని తీసుకువచ్చిందని ఆ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకించాలని సీఎం చంద్రబాబును కోరారు. గత ఎన్నికలలో ముస్లింలు టీడీపీకి మద్దతు తెలిపారని సంఘం నాయకులు గుర్తు చేశారు. కార్యక్రమంలో ముస్లిం సంఘం నాయకులు చికెన్ రాజ, అల్లాబకాష్, ముస్లింలు పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలతో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు

ఎమ్మిగనూరు: పట్టణంలోని ఈద్గామైదానంలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలతో ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే కొంత మంది యువకులు, పిల్లలు వక్ఫ్‌బిల్లును వ్యతిరేకిస్తూ ఈద్గా బయట ప్లేకార్డులు ప్రదర్శించి శాంతియుతంగా నిరసన తెలిపారు. వక్ఫ్‌బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అగ్నివీర్‌కు కోసిగి యువకుడి ఎంపిక


వడ్డె యువ రాజు

కోసిగి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తొమ్మిదవ వార్డు శ్రీరామ్‌నగర్‌లో నివాసముంటున్న వడ్డె గోవిందు, నాగలక్ష్మి దంపతుల కుమారుడు వడ్డె యువరాజు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఇండియన్ ఆర్మీకి సెలెక్ట్ అయ్యారు. 1 నుంచి 5వ తరగతి వరకు కోసిగి ఎంపీపీ కేజీ ప్రాథమిక పాఠశాల, 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు కోసిగిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యనుఅభ్యసించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారం, ట్యూషన్ ఉపాధ్యాయుడు కోడి రాజేష్ మెళకువలతో ఆర్మీకి ఎంపికయ్యారు. దేశానికి సేవ చేసి కోసిగి మండలానికి మంచి పేరు తీసుకవస్తానని యువరాజు అన్నారు.

వైభవంగా తారాపురం ఆంజనేయస్వామి రథోత్సవం


ఆంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

పెద్దకడుబూరు, మార్చి31(ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండంలోని తారాపురం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవాన్ని గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే స్వామివారికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం స్వామివారి రథాన్ని లాగారు. కార్యక్రమంలో మంత్రాలయం టీడీపీ యువనాయకులు రామకృష్ణారెడ్డి, రాజారెడ్డి, టీడీపీ రైతు సంఘం అధికార ప్రతినిధి నరవరమాకాంతరెడ్డి, బసలదొడ్డి ఈరన్న, మల్లికార్జున, మీసేవా ఆంజనేయులు, ఎంజీ నరసన్న, రామాంజనేయులు, సీఐ మంజునాథ్, ఈవో సాయికుమార్, గ్రామ పెద్దలు భరత్‌కుమార్, కౌశిక్‌స్వామి పాల్గొన్నారు.

గోనెగండ్లలో ఘనంగా వసంతోత్సవం


గోనెగండ్లలో ప్రభోత్సవం

గోనెగండ్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఉగాది మరుసటి రోజు సోమవారం వసంతోత్సవాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గోనెగండ్లలో సీతారామాంజినేయ ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తూ గ్రామ వీధుల్లో యువకులు, పిల్లలు వసంతోత్సవం జరుపుకున్నారు. శ్రీరామనగర్ కాలనీలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి ఆధ్వర్యంలో మహిళలు వసంతోత్సవంలో పాల్గొని ఉట్టి కొట్టి రంగులు చల్లుకున్నారు. సాయంత్రం గోనెగండ్లలో ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు కోలాటం, నందకోళ్ల సేవలు నిర్వహించారు. ప్రభను లాగారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ గురురాజారావు, భాస్కర్‌రెడ్డి, గోవిందు, దొరబాబు, శివరాముడు, కురాకులు సురేష్‌బాబు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే బైలుప్పలలో చెన్నకేశవస్వామి జాతర నిర్వహించారు. సోమవారం వసంతోత్సవాన్ని జరుపుకున్నారు. అలాగే సాయంత్రం అంగరంగవైభవంగా ప్రభోత్సవం నిర్వహించారు. వంద అడుగుల ప్రభను ప్రత్యేకంగా అలంకరించి ఆంజినేయ స్వామి దేవాలయం నుంచి ఈశ్వరదేవాలయం వరకు లాగారు. ప్రభోత్సవాన్ని తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అలాగే పెద్దనేలటూరు గ్రామంలో లక్ష్మీ చెన్నకేశవ దేవాలయం నుంచి గ్రామ శివార్లలోని జెమ్మి చెట్టు వరకు ప్రభోత్సవాన్ని నిర్వహించారు. రంగులు చల్లుకొని ఆనందం వ్యక్తచేశారు. మహిళలు స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పాల్గొన్నారు.




కౌతాళం: వల్లూరులో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువకులు

గ్రామాల్లో ఉగాది హోలీ

కౌతాళం: మండలంలో సోమవారం ఉగాది హోలీ వేడుకలను యువతీ, యువకులు, పిల్లలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే పశ్చిమ ప్రాంతాలలో ఉగాది మరుసటి రోజు హోలీ పండుగను జరుపుకోవడం ప్రత్యేకత. రంగులు ఒకరిపై ఒకరు జల్లుకొని ఉత్సహంతో హోలీ వేడుకలను జరుపుకున్నారు.

కోసిగి: మండల పరిధిలోని అగసనూరు గ్రామంలో సోమవారం ఉత్సాహంగా యువతీ యువకులు రంగోళి పండుగ జరుపుకున్నారు. ఉగాది మరుసటి రోజు పశ్చిమ ప్రాంతంలోని పల్లెలు హోలీ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. అందులో భాగంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో యువకులు, పిల్లలు రంగులు చల్లుకుంటూ హోలీ వేడుకలు జరుపుకున్నారు. అగసనూరులో జనచైతన్య యూత్ సభ్యులు ఉత్సాహంగా రంగులు చల్లుతూ సంబరాలు చేసుకున్నారు.

ఎమ్మిగనూరు రూరల్/పెద్దకడుబూరు: ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు మండలాల్లో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఎమ్మిగనూరు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం తెల్లవారు జాము నుంచే చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. మండలంలోని సిరాలదొడ్డి, కడిమెట్ల, కడివెళ్ల, రాళ్లదొడ్డి, కె.తిమ్మాపురం, గువ్వలదొడ్డి తదితర గ్రామాల్లో చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకున్నారు. అలాగే పెద్దకడుబూరులో టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవరమాకాంతరెడ్డి, ఈరన్న, పుల్లయ్య, సోమన్న, రాజులతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు, చిన్నారులు ఒకరికొరు రంగులు చల్లుకొని సంబరాలను జరుపుకున్నారు.


గోనెగండ్లలో ఉట్టి కొడుతున్న సర్పంచ్ హైమావతి


సిరాలదొడ్డి గ్రామంలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


కోసిగి: అగసనూరులో రంగులు చల్లుకుంటున్న యువకులు